ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 29 సెప్టెంబరు 2025





నీరుకొండపై ఆరొందల అడుగుల విగ్రహం

- రూ.3 వేల కోట్లతో అతిపెద్ద పర్యాటక కేంద్రం
- తుది మెరుగుల్లో ఎన్టీఆర్ స్మారకం డీపీఆర్

రాజధానిలో.. ఠీవీగా ఎన్టీఆర్

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

రాజధాని అమరావతిలో నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహాన్ని నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. పదేళ్లనాటి ఈ కలను సాకారం చేయాలని ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టుదలగా ఉన్నారు. దీనికి సంబంధించి డీపీఆర్ కూడా దాదాపు సిద్ధమైంది. గత మేలో షెలాడి అసోసియేట్స్ అనే కంపెనీకి డీపీఆర్ తయారీ బాధ్యతలను ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కార్పొరేషన్ అప్పగించింది. కాగా ఈ కంపెనీ రూపొందించిన విగ్రహ నమూనాలను ఇటీవల చంద్రబాబు పరిశీలించారు. రాజధాని పరిధిలోని నీరుకొండ 169 ఎకరాల్లో విస్తరించి సుమారు 300 అడుగుల ఎత్తులో ఉంటుంది. ఈ కొండ శిఖరంపైన సుమారు 14 ఎకరాలను చదును చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అనువుగా తయారుచేయనున్నారు. ఇక్కడ ముందుగా వంద అడుగుల ఎత్తులో బేస్ నిర్మాణాన్ని చేపట్టి దానిపై మరో 200 అడుగుల ఎత్తులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నారు. అపుడు కొండ పీఠభాగం నుంచి మొత్తం ఎత్తు ఆరొందల అడుగులుగా ఉంటుందని అధికారులు తెలుపుతున్నారు. ప్రభుత్వం నిర్మించనున్న గవర్నమెంట్ కాంప్లెక్సులో ఓ చివర నుంచి సీఎం నివాసం, రాజ్‌భవన్, సెక్రటేరియేట్, అసెంబ్లీ భవనాలు రానుండగా అదే వరుసలో ఇటు చివరన నీరుకొండ శిఖరంపై ఎన్టీఆర్ విగ్రహం వస్తుంది. మొత్తంగా చూస్తే కొండపై నుంచి ఎన్టీఆర్ విగ్రహం ఉత్తరాభిముఖంగా ఉండి రాజధాని మొత్తాన్ని చూస్తున్నట్టుగా దృశ్యభావన కలుగుతుంది.

ప్రాజెక్టుపై సమగ్ర అధ్యయనం

ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టును సాదాసీదాగా కాకుండా నిర్వహణ భారం కానివిధంగా ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుంది. విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో గత వైసీపీ ప్రభుత్వం నిర్మించిన డాక్టర్ అంబేద్కర్ మెమోరియల్ ప్రాజెక్టు అసంపూర్ణంగా ఉండి విజయవాడ నగరపాలకసంస్థకు నిర్వహణభారంగా మారింది. దీనిని దృష్టిలో ఉంచుకునే ఎన్టీఆర్ ప్రాజెక్టును సమగ్రంగా చేపట్టి భవిష్యత్తులో ఆర్థికంగా ఇబ్బందులు తలెత్తకుండా పర్యాటక, వాణిజ్య పరమైన అంశాలను కూడా జోడిస్తున్నారు. ఆ దిశగా ఇప్పటికే విజయవంతంగా, పర్యాటకులను ఆకట్టుకునేలా


(మిగతా 6లో)



ఎన్టీఆర్ విగ్రహ ఆకృతులను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు (పాతచిత్రం)


స్టాచ్యూ ఆఫ్ యూనిటీ స్ఫూర్తిగా...

గుజరాత్‌లోని ఏక్తానగర్‌లో స్టాచ్యూ ఆఫ్ యూనిటీ (సర్దార్ వల్లభాయ్‌పటేల్) విగ్రహ నమూనాను స్ఫూర్తిగా తీసుకుని నీరుకొండపై ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనిని గతంలో రూ.450 కోట్లతో వంద అడుగుల ఎత్తులో నిర్మించాలని భావించింది. అయితే అమరావతిలో ఈ ప్రాజెక్టు అత్యున్నతంగా ఉండాలన్న ఆలోచనతో విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎన్టీఆర్ విగ్రహాన్ని సుమారు 600 అడుగుల ఎత్తులో నిర్మించేలా డిజైన్‌లో మార్పు చేశారు.



నీరుకొండపై ఎన్టీఆర్ విగ్రహం నమూనా

రాజధానిలో స్వర్గీయ నందమూరి తారక రామారావు నిలువెత్తు విగ్రహం ఠీవీగా ఉండనున్నది. అమరావతి ఖ్యాతిని.. విశిష్టతను పెంచేరీతిగా.. తెలుగుజాతి గౌరవాన్ని ప్రపంచం నలుదిశలా చాటేలా.. రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ స్మారక ప్రాజెక్టును చేపట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టు పేరుతో రాజధాని అమరావతిలోని నీరుకొండపై దేశంలోనే అత్యంత పెద్దదైన ఎన్టీఆర్ భారీ విగ్రహాన్ని నెలకొల్పనున్నది. రూ.3 వేల కోట్లతో దీనిని నభూతో నభవిష్యత్ అన్నచందంగా పెద్దఎత్తున అభివృద్ధి చేయనున్నారు. తెలుగుజాతి ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్టీఆర్ విగ్రహం నీరుకొండ కొండపై చాలా ఠీవిగా నిలబడనుంది. రాజధాని పరిధిలో శాఖమూరు సెంట్రల్‌పార్కు, రివర్ ఫ్రంట్, ఎన్టీఆర్ మెమోరియల్ ప్రాజెక్టులు పర్యాటకులను ఆకట్టుకునే విధంగా నిర్మిస్తున్నారు.



అట్టహాసంగా దసరా ఉత్సవాలు

మార్టూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో ఏడో రోజు ఆదివారం వివిధ రూపాల్లో దర్శనమిచ్చిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మార్టూరులో దుర్గామల్లేశ్వరి దేవస్థానంలో మహాచండీ దేవి అవతారంలో, ద్రోణాదులలో వారాహి అవతారంలో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. వలపర్ల, మార్టూరులోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో,పడమర బజారున రుక్మాబాయి సమేత పాండురంగ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో, నాగరాజుపల్లిలోని దేవాలయంలో అమ్మవారు వివిధ అలంకరణల్లో భక్తులకు దర్శనమిచ్చారు.

దసరాకు ఆరు ప్రత్యేక రైళ్లు | వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి | చదరంగంలో ప్రతి క్షణం విలువైనదే! -కోనేరు హంపి

6

అక్రమ లేఅవుట్లపై అలక్ష్యం

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్నా ప్రేక్షకపాత్ర
- అక్రమార్కులపై చర్యలకు అధికారుల మీనమేషాలు
- అటు ప్రభుత్వానికి, ఇటు కొనుగోలుదారులకు తీరని నష్టం

చీరాల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అనధికార లే అవుట్లపై చర్యలు తీసుకోవడంలో అధికారులు అలక్ష్యం చూపుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా అక్రమ లే అవుట్లు వెలుస్తున్నా అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు. అక్రమల లేఅవుట్లతో ప్లాట్లు కొనుగోలు చేసి బ్యాంకుల నుంచి రుణాలు రాక.. నిర్మాణాలకు అనుమతులు అందక పలువురు అల్లాడుతున్నా అధికారులు తమకు ఏమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. అక్రమ లేఅవుట్లతో రియల్టర్లు జేబులు నింపుకునేందుకు అధికారులు సహకరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. లే అవుట్లకు అనుమతులు ఒంగోలు ఉడా పరిధిలో ఉన్నాయని అధికారులు నెలవారీ మామూళ్లతో కన్నెత్తి చూడటంలేదని సమాచారం. లేఅవుట్ నిర్మాణానికి సంబంధించి కన్వర్షన్ చెల్లింపుల్లో అధికారులు, అక్రమార్కులు ఏకమై నిబంధనలకు తిలోదకాలు ఇస్తున్నారన్న విమర్శలున్నాయి. ఒత్తిడి పెరిగితే కన్వర్షన్‌కు దరఖాస్తులు చేయిస్తున్నారు గానీ చెల్లింపులు పూర్తి చేయనీయడం లేదు. ఏదయినా ఇబ్బంది జరిగుతుంది అనుకుంటే అప్పుడు వ్యవహారాన్ని పట్టాలెక్కిస్తున్నారు. నియోజకవర్గంలో పర్యాటక రంగం అభి వృద్ధికి కూటమి బాటలు వేసింది. దీంతో రిసార్టులు, విల్లాలు పెరుగుతు న్నాయి. 300 చదరపు అడుగులపైన వాణిజ్య భవనాలు నిర్మాణాలు జరగా లంటే ఉడా అనుతులు తప్పని సరి. అయితే అందుకు సంబంధించి ఎటు వంటి ప్రక్రియ జరగడం లేదు. పైగా కొనుగోలు చేసిన వారు నిర్మాణాలు జరపాలంటే రిజిస్ట్రేషన్‌లో సుమారు 45 శాతం అపరాధ రుసుము చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇంత జరుగుతున్నా అధికారులు మహా అయితే నోటీసులు ఇచ్చి ముఖం తిప్పుకుంటున్నారు.



చీరాల - వేటపాలెం జాతీయ రహదారిలోని లే అవుట్

విద్యార్థులకు సైకిళ్లు అందజేస్తాం

- దివ్యాంగులకు ట్రై స్కూటీల పంపిణీలో మంత్రి గొట్టిపాటి

అద్దంకి, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని విద్యార్థులకు సైకిళ్లు, దివ్యాంగులకు ట్రైస్కూటీలను అందజేస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ సహకారంతో ఆదివారం 35 మంది దివ్యాంగులకు అద్దంకిలో రూ.49 లక్షల విలువైన ట్రై స్కూటీలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే విద్యార్థులకు కూడా సైకిళ్లు అందజేస్తామన్నారు. విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబసభ్యులకు రూ.5 లక్షలు చొప్పున పరిహారం అంద జేశారు. మెగా డీఎస్సీలో ఎంపికైన అనూషను మంత్రి అభినందిం చారు. అద్దంకిలో విద్యుత్ సమస్య లేకుండా చేయాలని 1300 స్థంభాలను మార్చామని, మరో 700 మార్చేం దుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ పీ కాలనీ, ద్వారకానగర్, టిడ్కో ఇళ్ల వద్ద సబ్‌స్టేషన్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. నియోజకవర్గంలో రూ.19.60 కోట్లతో 564 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి 2252 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేశామన్నారు. మరో వెయ్యి కనెక్షన్లను త్వరలో మంజూరు చేస్తామన్నారు. తిమ్మాయపాలెం నుంచి రామాయపాలెం, మారెళ్ల రోడ్డుకు నిధులు మంజూరయ్యాయని త్వరలో పను లు ప్రారంభమవుతాయన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి 100 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు నాగినేని రామకృష్ణ, కరిప రమేష్, మానం మురళీమోహన్‌దాస్, కఠారి నాగేశ్వరరావు, కాకాని అశోక్, కుందారపు రామారావు, గుంజి శ్రీనివాస రావు, బండారపల్లి శ్రీనివాసరావు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగురాలుకి స్కూటీని అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



ట్రైస్కూటీలతో దివ్యాంగుల ప్రదర్శన



వరదనీరు పోటెత్తటంతో పెనుమూడి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ

కృష్ణమ్మ.. మహోగ్రం

- బిక్కుబిక్కుమంటున్న లంకలు
- పెనుమూడి పల్లెపాలెం తాకిన వరద
- బ్యారేజి నుంచి 6.50 లక్షల క్యూసెక్కులు విడుదల
- ఇసుక బస్తాలతో కరకట్టను పటిష్ఠం చేస్తున్నఅధికారులు
- లంక గ్రామాల్లో కలెక్టర్ పర్యటన.. నదిలో ఉధృతి పరిశీలన

కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి భారీగా నీటి విడుదలతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. ఆదివారం ఉదయం నుంచి నదిలో వరద క్రమేపీ పెరుగుతూ సాయంత్రానికి తీవ్రమైంది. శ్రీశైలం నుంచి 5,88,743 క్యూసెక్కుల వస్తుండగా వచ్చిన నీరు వచ్చినట్లుగా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ 26 గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి కూడా దిగువకు విడుదల చేస్తున్నారు. ఆరు లక్షల ఎనిమిది వేల క్యూసెక్కులు నీరు వస్తుండటంతో పులిచింతల ప్రాజెక్టు అధికారులు రెడ్ అలర్ట్ ప్రకటించారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కూడా 6.50 లక్షల క్యూసెక్కులను దిగువకు విడుదల చేశారు. సోమవారం ఉదయం 8 గంటలకు 6.57 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం దాటొచ్చని ఇరిగేషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీంతో బ్యారేజీ నుంచి సముద్రం వరకు కృష్ణమ్మ ఉరకలెత్తుతూ ప్రవహిస్తోంది. కృష్ణానదికరకట్ట, ఓలేరుపల్లెపాలెం, రావిఅనంతవరం, కనగాలవారిపాలెం, బొబ్బర్లంక, విశ్వేశ్వరం, పెనుమూడి ప్రాంతాల్లో బలహీనంగా కరకట్టను ఇసుకబస్తాలతో అధికారులు పటిష్ఠం చేస్తున్నారు. ఇప్పటికే పెనుమూడిపల్లెపాలెంలో తీరంలోని గృహాలు నీటమునిగాయి. పెసర్లంక వెళ్లే చిన్నరేవు ఓలేరు నుంచి వెళ్లే చిన్నరేవు వరదనీటిలో మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెనుమూడిపల్లెపాలెంలోని వారిని పునరావస కేంద్రాలకు తరలించారు. పునరావసకేంద్రాల్లో ఫ్యాన్లు ఏర్పా టు చేసి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలంటూ మంత్రి శివప్రసాద్ అధికారులకు సూచించారు.

వరద నీరు కొల్లూరు మండలంలోని సుగ్గున లంక, చింతల్లంక, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక, భట్టిప్రోలు మండల పరిధిలోని పెదలంక, చింతమోటు, పెసర్లంక తదితర గ్రామాల పరిధిలోని లోతట్టు ప్రాంతాల్లోని పంట భూములను ముంచెత్తింది. వాణిజ్య పంటలతో పాటు ఇటుక బట్టీలు కూడా ముంపునకు గురయ్యాయి. ఆవులవారిపాలెం, గాజుల్లంక రహదారిపైకి కూడా నీరు చేరింది. చినరేవులో నుంచి వరద దోనేపూడి వద్ద, భట్టిప్రోలు మండలం పెదపులివర్రు చప్టాలపై నుంచి ప్రవహించడంతో రాకపోకలను అధికారులు నిలిపి వేశారు. భారీ వరదపై వదంతులు రావడంతో లంక గ్రామాలు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఓలేరుపల్లెపాలెం, పెనుమూడిపల్లెపాలెం, మైనేనివారిపాలెం తదితర గ్రామాల్లోని ప్రజల కోసం ముందస్తుగా సమీపంలోని పాఠశాలలను పునరావస కేంద్రాలుగా ఉపయోగించుకునేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం సాయంత్రం కొల్లూరు మండలంలోని కిష్కిందపాలెం, కృష్ణనగర్, పోతార్లంక, గాజుల్లంక, ఆవులవారిపాలెం, గ్రామాల్లో పర్యటించి వరద ఉధృతిని కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ పరిశీలించారు. వరద సమాచారాన్ని ఎప్పటికప్పుడు ఆయా గ్రామాల సర్పంచ్‌లకు వాట్సాప్ మెసేజ్‌ల ద్వారా తెలియజేస్తున్నామని, వారు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ట్రాక్టర్లను సిద్ధం చేసుకోవాలని సర్పంచ్‌లకు సూచించారు. సోమవారం సాయంత్రానికి వరద తగ్గుముఖం పడుతుందని ఎవరు అధైర్యపడాల్సిన పనిలేదని గ్రామస్థులకు చెప్పారు. అధికారులంతా అందుబాటులో ఉంటారని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రామలక్ష్మి, డీపీవో ప్రభాకరరావు, తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి
అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

బాపట్ల: కృష్ణానదిలో నీటి ప్రవాహం రెండో లెవల్‌పైన ప్రహిస్తుంది కాబట్టి అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. 25 పునరావాస కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది సిద్ధంగా ఉండాలన్నారు. పునరావాస కేంద్రాలకు ఇన్‌చార్జిగా డీఆర్‌డీఏ పీడీ లవన్న ఉన్నారని తెలిపారు. రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో విధులు కేటాయించిన అధికారులు ఎప్పటికప్పుడు వరద ఉధృతిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుకుని వరద పరిస్థితులను అంచనా వేసి చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద రెండో ప్రమాద హెచ్చరిక

తాడేపల్లి టౌన్: కృష్ణానదికి ఎగువ నుంచి భారీగా వరద పోటెత్తుతుండటంతో ప్రకాశం బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ఆదివారం రాత్రి 7 గంటల సమయంలో ఇన్‌ఫ్లో 6,50,389 క్యూసెక్కులకు చేరుకుంది. బ్యారేజ్‌లో పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 3.07 టీఎంసీలు నిల్వ ఉండటంతో ఉదయమే రెండో ప్రమాద హెచ్చరికని జారీ చేశారు. బ్యారేజ్ గేట్లు అన్ని ఎత్తేసి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లోలో పెరుగుదల కనిపిస్తుండటంతో సోమవారం ఉదయం 8 గంటలకు 6.57 లక్షల క్యూసెక్కుల ప్రవాహం దాటొచ్చని ఇరిగేషన్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.



చినరేవు వల్ల ఇబ్బందులను కలెక్టర్‌కు వివరిస్తున్న పోతార్లంక గ్రామస్తులు



వరద నీటిలో కొల్లూరులోని ఇటుక బట్టీలు



అరవింద వారధి వద్ద ఉధృతంగా వరద ప్రవాహం



రేపల్లెమండలం కనగాలవారిపాలెంలో కరకట్టను ఇసుక బస్తాలతో పటిష్టపరుస్తున్న ఆర్‌సీఏఈ నాగేశ్వరరావునాయక్



కొల్లూరు : వరద ముంపునకు గురైన అరటి తోట

శిల్పారామాలకు జీవం పోసిన సీఎం చంద్రబాబు

● చైర్‌పర్సన్ మంజులారెడ్డి


సర్టిఫికెట్లను ప్రదానం చేసిన మంజులారెడ్డి

రెంటచింతల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన శిల్పారామాలకు జీవం పోసిన వ్యక్తి సీఎం నారా చంద్రబాబునాయుడని శిల్పారామం చైర్‌పర్సన్ చేర్రెడ్డి మంజులారెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి రెంటాల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు గుంటూరు శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్య కళా ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా మంజులారెడ్డి మాట్లాడుతూ.. గత పాలనలో రూ.6 లక్షలు ఉన్న ఆదాయం నేడు రూ.2 కోట్లకు చేరుకోవడంలో కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలే కారణమన్నారు. గుంటూరులో రూ.65 లక్షలతో బోటింగ్ ఏర్పాటు చేయడానికి టెండర్లను పూర్తి చేశామని, త్వరలో పనులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. హైస్కూల్ హెచ్ఎం నాగభారతిని ఘనంగా సత్కరించి, చిన్నారులకు మెరిట్ సర్టిఫికెట్లను చైర్‌పర్సన్ ప్రదానం చేశారు.

నన్నపనేని పెరటిలో జంబో అరటి గెల


పెరటిలోని అరటితో నన్నపనేని

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మహిళ కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి పెరటిలో జంబో అరటి గెల కాసింది. నాందేడు రకం అరటిని పెంచుతున్నామని దీనికి 16కు పైగా హస్తాలు ఏర్పడి 240 కాయలు కాశాయని ఆమె తెలిపారు. పెరటిలో వివిధ రకాల మొక్కలు పెంచుతూ వాటి సంరక్షణలో ప్రతిరోజు నన్నపనేని నిమగ్నమవుతున్నారు.

దసరాకు ఆరు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): దసరా పండగ రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా దూర ప్రాంతాలకు ఆరు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07066 తిరుపతి - గువహటి రైలు ఆదివారం రాత్రి బయలుదేరింది. ఈ రైలు సోమవారం మధ్యాహ్నం 3.20కి గుంటూరు చేరుకుంటుంది. 07071 సికింద్రాబాద్ - అగర్తల అక్టోబరు 1న బుధవారం బయలుదేరుతుంది. 07073 గుంటూరు - రంగాపార నార్త్ వచ్చే బుధవారం బయలుదేరుతుంది. 07074 గుంటూరు - న్యూ జలపాయిగురి స్పెషల్ అక్టోబరు 2న గురువారం బయలు దేరుతుంది. అన్ని రైళ్లలో జనరల్, స్లీపర్, సెకండ్ ఏసీ బోగీలుంటాయి.

జగనన్న కాలనీ పేరుతో పేదలను ముంచిన 'బొల్లా'

● ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు


మాట్లాడుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) కార్యకర్తలను కాపాడుకోవడానికే డిజిటల్ బుక్ ప్రారంభించామంటున్న వైసీపీ.. నారా లోకేశ్ రెడ్ బుక్‌ను చూసి దానిని తేవడం పులిని చూసి నక్క వాత పెట్టుకున్న సామెతగా ఉందని.. ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఎద్దేవ చేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేసిన అసత్య ఆరోపణలను ఖండించారు. జాలపాలెం అంశంలో వైసీపీ ప్రభుత్వంలోనే కోర్టుకు వెళ్లారని.. నేడు కూటమి ప్రభుత్వంపై బురద చల్లుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో వినుకొండ పరిస్థితుల దృష్ట్యా ఎస్ఎస్‌పీ స్థలం ఇస్తే ఏమి చేశారని నిలదీశారు. కొండపై దేవాలయం, ఘాట్ రోడ్డు నిర్మించలేక పోయారని మండిపడ్డారు. ఇనిమెళ్లలో శ్మశాన భూమి ఆక్రమించారన్న ఆరోపణలను కొట్టిపడేశారు. గతంలో పదవిని అడ్డు పెట్టుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసింది బొల్లా కాదా అని నిలదీశారు. మాజీ ముఖ్యమంత్రుల నుంచి తమ కంపెనీ ఎన్నో అవార్డులు పొందిందని పేర్కొన్నారు. నాణ్యత ఉండబట్టే తమ కంపెని రైతుల మన్ననలు పొందుతోందన్నారు. బొల్లా చౌకబారు చద్ది విమర్శలు ప్రజలు నమ్మరని జీవీ స్పష్టం చేశారు. జగనన్న కాలనీ పేరుతో పేదలను మోసం చేసిన చరిత్ర నీదంటూ.. బొల్లాపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జున, నాగశ్రీను, బీసీ నాయకులు గోవిందరాజు పాల్గొన్నారు.

ఆలోచింపజేస్తున్న నాటక ప్రదర్శనలు


కస్తూరి తిలకం నాటకంలోని సన్నివేశం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రదర్శిస్తున్న నాటిక, నాటకాలు ప్రేక్షకులను ఆలోచింపజేస్తున్నాయి. కళల కాణాచి, ఆర్ఎస్ఆర్ గ్రీన్ వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాటకోత్సవాల్లో ఆదివారం రెండు పద్య నాటకాలు, సాంఘిక నాటకం, నాటికను ప్రదర్శించారు. బిల్వమంగళుడు, చింతామణి మధ్య సన్నివేశాలను కళాకారులు కస్తూరి తిలకంలో ప్రదర్శించారు. ఈ నాటకాన్ని శారద ప్రసన్న రచించగా, సుబ్బరాజు దర్శకత్వం వహించారు. మదిర చందాల కేశవరాజు కళాపరిషత్ కళాకారులు అద్భుత ప్రదర్శన ఇచ్చారు. మిర్యాలగూడ సాంస్కృతిక సమాఖ్య కళాకారులు ప్రదర్శించిన బ్రహ్మరథం నాటకాన్ని శివ సుబ్రహ్మణ్యం రచించగా రామచంద్రరావు దర్శకత్వం వహించారు. హైదరాబాద్ కళాంజలి కళాకారులు ప్రదర్శించిన సాంఘిక నాటకం యాగం శ్రీశైలంమూర్తి రచించగా రాధాకృష్ణమూర్తి దర్శకత్వం వహించారు. విజయవాడ హర్ష క్రియేషన్స్ కళాకారులు భువి కోరని భ్రమణం సాంఘిక నాటకం ప్రదర్శించారు. పి.వెంకటేశ్వరరావు నాటకీకరణ చేయగా, కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించారు. సోమవారం నాలుగు నాటికలు ప్రదర్శించనున్నారు. కళల కాణాచి అధ్యక్షుడు, సినీ రచయిత బుర్రా సాయిమాధవ్, ప్రధాన కార్యదర్శి గోపరాజు విజయ్, చెరుకుమల్లి సింగారావు, దేవరపల్లి భవానీ, హకీంజాని, అయినాల మల్లేశ్వరరావు, కనపర్తి మధుకర్ తదితరులు పర్యవేక్షించారు.

చదరంగంలో ప్రతి క్షణం విలువైనదే!

ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి


మాట్లాడుతున్న కోనేరు హంపి

గుంటూరు (విద్య) సెప్టెంబరు28 (ఆంధ్రజ్యోతి): చదరంగంలో ప్రతి క్షణం విలువైనదేనని ఇండియన్ చెస్ గ్రాండ్ మాస్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత కోనేరు హంపి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆదివారం కోనేరు హంపి మాట్లాడుతూ చెస్ క్రీడాకారులందరికీ ఈ ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్ ఒక గొప్ప వేదికని పేర్కొన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే క్రీడాకారులతో ఆడే అవకాశం.. అనుభవాన్ని పెంపొందించుకునేందుకు దోహదం చేస్తుందన్నారు. ఆటలో కొన్నిసార్లు ఆటంకాలు, వైఫల్యాలు ఎదురైనా వాటిని అధిగమించే ధైర్యం చాలా ముఖ్యమన్నారు. పాజిటివ్‌గా ఆలోచిస్తూ, ఎప్పటికీ ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా ముందుకు సాగాలన్నారు. నెరవేర్చాం అనుకోవడం కంటే ఇంకా నేర్చుకోవాలి అనే తపన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ ఏకే వర్మ, విజ్ఞాన్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు చాంబర్ ఆఫ్ కామర్స్.. కార్యవర్గ ఎన్నికలు

గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వ్యాపారవర్గాలకు ప్రతిష్టాత్మకమైన ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం ఎన్నికలకు రంగం సిద్ధమైంది. జిన్నా టవర్ సెంటర్‌లోని చాంబర్ భవనంలో నిర్వహణ ఏర్పాట్లు చేశారు. చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు, అధ్యక్షుడు యేల్చూరి వెంకటేశ్వర్లు నేతృత్వంలో సోమవారం ఉదయం సర్వసభ్య సమావేశం నిర్వహించిన అనంతరం ఎన్నికలు ప్రారంభం కానున్నట్లు ఆతుకూరి తెలిపారు. యేల్చూరి ప్యానల్‌ను గెలిపించుకునేందుకు.. ఆతుకూరి ఆంజనేయులు పట్టుదలతో ఉన్నారు. ఆయన స్వయంగా తెనాలి, బాపట్ల, పల్నాడు ప్రాంతాల్లో పర్యటిస్తూ విస్తృత ప్రచారం చేశారు. బాలకృష్ణ ప్యానల్ సభ్యులు కూడా ప్రచారం చేసుకుంటున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. అనంతరం బ్యాలెట్ బాక్స్‌లో పోలైన ఓట్లను అప్పటికప్పుడు లెక్కించి ఫలితాలను ప్రకటించనున్నారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగనుంది. గతేడాది జరిగిన ఎన్నికల ఫలితాలను అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు గంటలకు ప్రకటించారు.

రాజధానిలో.. ఠీవీగా ఎన్టీఆర్

(5వ పేజీ తరువాయి)

నిర్మించిన స్టాచ్యూ ఆఫ్ యూనిటీ ప్రాజెక్టు కు సంబంధించిన అంశాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తోంది. ఈ క్రమంలో ఇప్పటికే మంత్రి నారాయణ, సీఆర్‌డీఏ కమిషనరు కన్నబాబు, ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారధితోపాటు అధికారుల బృందం ఓమారు ఏక్తానగర్‌ను సందర్శించి వచ్చింది.

ప్రాజెక్టులో ప్రధానాంశాలివే

ఎన్టీఆర్ విగ్రహన్ని ఏర్పాటు చేయనున్న బేస్‌లో ఎన్టీఆర్ మెమోరియల్ హాలు, మ్యూజియం, ఎన్టీఆర్ జీవిత చరిత్రను తెలియజేసే కళాకృతులు, మినీ థియేటర్, కన్వెన్షన్ సెంటర్‌లను నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలిసింది. ఇందుకోసం బేస్ పీఠభవనాన్ని జీ+3గా నిర్మించనున్నారు. కొండ శిఖరంపై క్యాంటీన్, ప్రత్యేకాకర్షణగా ఫ్యూనిక్యులర్ రైల్వే, కొండపైన పార్కింగ్ ఏరియా, టిక్కెట్ కౌంటర్, కొండపైకి ఘాట్‌రోడ్డు, సర్వీసు భవనాలు, ఉద్యానవనాలు, ఫ్యాబ్రిక్ కప్ నిర్మాణాలతో ఈ ప్రాజెక్టు రూపుదిద్దుకోనున్నది. కొండ దిగువన 450 ఎకరాల సరస్సును యాత్రికులను ఆకట్టుకునేలా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఇందులో జెట్టీ బోటింగ్ ఉంటుంది. చుట్టూ వాటర్ ఫ్రంట్‌గా ఉండే కొండ దిగువన స్టార్ హోటల్, షాపింగ్ సెంటర్లు, రిసార్టులను ఏర్పాటుచేయనున్నారు. ఎన్టీఆర్ విగ్రహం లోపల లిఫ్టులు ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాజెక్టు ఇంచుమించు 170 ఎకరాల్లో ఆవిష్కృతం కానుంది. ఎన్టీఆర్ విగ్రహంతో పాటుగా అల్లూరి సీతారామరాజు, పొట్టి శ్రీరాములు విగ్రహాలను కూడా ఏర్పాటుచేసే అంశాలను కూడా ప్రభుత్వం పరిశీలిస్తోంది.

బీసీ బిడ్డను ఆదుకోవడం తప్పా?

● వైసీపీ తీరుపై కనపర్తి ఆగ్రహం



గుంటూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల హత్యాకాండలో బలైన బీసీ నేత బిడ్డను ఆదుకోవడం తప్పెలా అవుతుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాడు ప్రజల కోరికపై నరహంతకుడు, అరాచకవాదైన పిన్నెల్లి సుందరరామిరెడ్డిని మావోయిస్టులు హతమార్స్తే ఆయన కుమారుడికి ఏసీటీవో ఉద్యోగం ఇచ్చిన ఆనాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేసింది ఒప్పయితే, నేడు వైసీపీ గూండాలు పట్టపగలు అతికిరాతకంగా ఓ బీసీ నాయకుడి గొంతు కోస్తే.. అతడి కుమారుడికి ఉద్యోగం ఇవ్వడం తప్పెలా అవుతుందని వైసీపీ నేతలను ప్రశ్నించారు. పల్నాడు జిల్లాలో హత్యకు గురైన తోట చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం కల్పించే బిల్లును మండలిలో వైసీపీ సభ్యులు అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. 'బడుగు, బలహీన వర్గాల వారిని వేధించి చంపిన కుటుంబానికి మాత్రం అసిస్టెంట్ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ ఉద్యోగం ఇవ్వొచ్చుకానీ, హత్య చేయబడ్డ బీసీ బిడ్డకు మాత్రం జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం కూడా ఇవ్వకూడదా?' అని ప్రశ్నించారు. వైసీపీ ఎమ్మెల్సీ ఏసురత్నం ఇది మంచి ప్రతిపాదన అని చెపుతున్నా వినకుండా, ఆయన్ను కూడా బొత్స సత్యనారాయణ 'ఏయ్' అంటూ సభలో బెదిరించడమేమిటని మండిపడ్డారు.

అమరేశ్వరుని సన్నిధిలో పల్లా


పల్లా దంపతులకు స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఈఓ రేఖ

అమరావతి, సెప్టెంబరు 28: అమరావతి లోని అమరేశ్వరస్వామి ఆలయాన్ని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదివారం ఉదయం కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయఅధికారులు, అర్చకులు శ్రీనివాసరావు దంపతులకు స్వాగతం పలికి ఆయన పేరు మీద స్వామివార్లకు పూజలు నిర్వహించారు. వేద మంత్రాలతో ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈఓ రేఖ ఉన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


ప్రమాద స్థలాల్లో ఆనందబాబు, ఆదినారాయణ మృతదేహాలు


దుర్గి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన దుర్గి మండల పరిధిలో చోటుచేసుకుంది. కంచరగుంటకు చెందిన రాయపాటి ఆనందబాబు (14) బైకుపై దుర్గి వచ్చి తిరిగి వెళ్తుండగా.. హాలియాకు వెళ్తున్న ట్రాక్టర్‌తో ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆనందబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ప్రమాదంలో.. గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం సిరిపురానికి చెందిన కొమరగిరి ఆదినారాయణ (36) మండలంలోని ఆత్మకూరు వద్ద గల ఓ నర్సరీలో పనిచేస్తున్నాడు. కూరగాయల కోసం బైకుపై కొడుకు శ్రీనివాసరావుతో కలిసి దుర్గి వస్తుండగా మార్కెట్‌యార్డు సమీపంలో గుర్తు తెలియని వాహనం వరిని ఢీకొంది. ఆదినారాయణ అక్కడికక్కడే మృతిచెందాడు. శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలు కావడంతో మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆనందబాబు, ఆదినారాయణ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

క్రాస్ చేస్తూ ఆటోకి లారీ తగిలి..


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో

ఫిరంగిపురం, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేరికపూడి గ్రామానికి చెందిన రమావత్ కృష్ణనాయక్ (69) ఆటలో ప్రయాణిస్తుండగా.. లారీ ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని పోలీసులు ఆదివారం తెలిపారు. కృష్ణనాయక్, మరో నలుగురు ఆటోలో మండలంలోని అమీనాబాద్ గ్రామంలో జరుగుతున్న అమ్మవారి నవరాత్రులకు వెళ్లి హరికథ చెప్పి తిరిగి వస్తున్నారు. ఫిరంగిపురం సమీపంలో శనివారం రాత్రి లారీని క్రాస్ చేస్తుండగా లారీ అతి వేగంగా, నిర్లక్ష్యంగా వస్తూ ఆటోకు తగిలింది. దీంతో ఆటో బోల్తా పడి కృష్ణ నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో నలుగురికి గాయాలయ్యాయి. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు.

చికిత్స పొందుతూ.. కౌలురైతు మృతి


అప్పారావు (ఫైల్ ఫోటో)

వట్టి చెరుకూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రుణ భారం అధికమై.. పంట చేతికొచ్చే మార్గం లేక మనస్తాపంతో పురుగు మందు తాగిన కౌలు రైతు చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారు జామున మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. మండలంలోని కొర్నెపాడు గ్రామానికి చెందిన మన్నవ వెంకట అప్పారావు(42) మూడేళ్లుగా సొంత పొలం రెండు ఎకరాలతో పాటు 25 ఎకరాల వరకు కౌలుకు పొలం తీసుకుని పత్తి, మిర్చి పంటలు సాగు చేస్తున్నాడు. రెండేళ్లుగా సరైన దిగుబడి, ధరలు లభించక అప్పుల భారం పెరిగి పోయింది. ఈ ఏడాది 20 ఎకరాల వరకు పత్తి పంట సాగు చేశాడు. ఇటీవల వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీటితో పత్తి మొక్కల ఎదుగుదల లేకుండా పోయింది. అప్పులు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఉండటం... పత్తి పైరు చేతికి అందే పరిస్థితి లేదనే మనస్తాపంతో.. ఈ నెల 23న వెంకట అప్పారావు పురుగు మందు తాగాడు. అతను అపస్మారక స్థితిలో ఉండటాన్ని గమనించి కుటుంబ సభ్యులు, స్నేహితులు గుంటూరులోని ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృత దేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య కాంచన, ఇద్దరు కుమారులు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

పిల్లలపై నిఘా ఉంచాలి: ఎస్పీ

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి) : దసరా సెలవుల నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై నిఘా ఉంచాలని ఎస్పీ బి.ఉమా మహేశ్వర్ హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాల్వలు, వాగులు, చెరువులు, సముద్ర తీరాల్లో ఈతకు వెళ్లిన యువకులు, చిన్నారులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇటీవల జిల్లాలో జరిగిన కొన్ని పరిణామాల కారణంగా హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాల వల్ల కృష్ణా నది, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయన్నారు. సూర్యలంక, వాడరేవు, రామాపురం సముద్రతీరాలకు వస్తున్న యాత్రికులు పోలీసుల హెచ్చరికలను లెక్క చేయకుండా సముద్రం లోతుకు వెళ్లి.. అలలకు కొట్టుకుపోతున్నారన్నారు. పర్యాటకులు, జిల్లా ప్రజలు పోలీసు శాఖ సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు.

16 ఏళ్లకు టెయిల్‌పాండ్‌కు భారీ వరద

రెంటచింతల,సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు ఆదివారం భారీగా వరద నీరు వస్తుండడంతో 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు గాను 16 గేట్లను 7 మీటర్లు, 2 గేట్లను 4.5 మీటర్ల మేర ఎత్తి పులిచింతలకు 5,88,988 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఎస్ఈ కె.వెంకటరమణ తెలిపారు. సాగర్ నుంచి 5,79,015 క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 72.79 మీటర్ల మేర నీరుండగా ఇది 5.375 టీఎంసీలకు సమానం. విద్యుదుత్పత్తిని నిలిపి వేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో ఉన్న సమయంలో 2009 సెప్టెంబరు 2 తర్వాత ఇంత భారీ స్థాయిలో నీరు రావడం ఇదే ప్రథమమని పేర్కొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 37.99 టీఎంసీల నీటి నిల్వ ఉన్నాయి. ఎగువ నుంచి 6,52,520 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ఐదు గేట్లను నాలుగు అడుగులు, 13 గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 6,08,816, లీకుల ద్వారా 400, మొత్తం 6,09,216 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

జాతీయ సెపక్ తక్రా పోటీలకు పొన్నపల్లి వాసి ఎంపిక

చెరుకుపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఈనెల 27నుండి 28వ తేదీ వరకు ఒంగోలులో జరిగిన 35వ సీనియర్ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలలో ప్రతిభ కనబరిచిన పొన్నపల్లికి చెందిన తుమ్మా వెంకటజ్యోత్స్న అక్టోబర్‌లో గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

అందుబాటులో మార్చురీ పెట్టె

కర్లపాలెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మానవత సంస్థ తరుపున ఏర్పాటు చేసిన మార్చురీ పెట్టెను అవసరమైనవారు ఉచితంగా వినియోగించుకోవచ్చని వెంకటసుబ్బారావు తెలిపారు. ఆదివారం కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండపంలో మానవత సంస్థ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మందపాటి పరమానందకుమార్, శ్రీనివాసరెడ్డి, బొమ్మనబోయిన సాంబయ్య, మంతెన నాగవర్మ, పిట్టు మల్లిఖార్జునరెడ్డి, ఆట్ల బాలాజీరెడ్డి, గొట్టిముక్కల బాలాజి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాన్ని అడ్డుకోవటం వైసీపీ రాక్షస రాజకీయమే

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో హత్యకు గురైన చంద్రయ్య కుమారుడికి సామాజిక దృష్టితో సీఎం చంద్రబాబు జూనియల్ అసిస్టెంట్ ఉద్యోగం ఇచ్చేందుకు ప్రతిపాదించిన సవరణ బిల్లును శాసనమండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ అడ్డుకోవటం మానవత్వం మరిచిన దారుణ చర్య అవుతుందని సంగం డెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి పేర్కొన్నారు. ఈ విషయమై ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీకి చెందిన ఎమ్మెల్సీ ఏసురత్నం చర్చలలో పాల్గొంటూ ఫ్యాక్షన్ హత్యలకు గురవుతున్నవారిలో అధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారే ఉంటున్నారని హత్యకు గురైన చంద్రయ్య బీసీ అయినందున తాను ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్ధిస్తున్నానని చెప్పటం అభినందనీయమన్నారు.

అరుదైన శస్త్రచికిత్స

● నాలుగు కిలోల కణితి తొలగించిన వైద్యులు

బాపట్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న మహిళకు ఖాజీపాలెం గ్రామంలోని శ్రీసత్యసాయి సుజల స్రవంతి ట్రస్ట్, శ్రీమధుసూదన్‌సాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సహకారంతో ఆరోగ్య మల్టీస్పెషాలిటి హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ దెందుకూరి రామభద్రరాజు పర్యవేక్షణలో శస్త్రచికిత్స చేశారు. గైనకాలజిస్టులు డాక్టర్ కృష్ణ, డాక్టర్ గీతికలు అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి 30సెంటీమీటర్ల వెడల్పు ఉన్న నాలుగు కిలోల కణితిని తొలగించారు. సూపరింటెండెంట్ రామభద్రరాజు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా నిర్వహిస్తున్న అన్ని రకాల శస్త్రచికిత్సలు, మందులు ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు.

పాండురంగాపురం ఎత్తిపోతల పథకానికి నూతన పైపుల ఏర్పాటు

బాపట్లరూరల్, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బాపట్ల మండలం పేరలి డ్రైన్ కాల్వపై ఉన్న పాండురంగాపురం ఎత్తిపోతల పథకం ఇనుప పైపులు శిథిలావస్థకు చేరాయి. శిథిలావస్థలో ఎత్తిపోతల పైపులు అనే శీర్షిక ఆంధ్రజ్యోతిలో వరుస కథనాలు ప్రచురించటంతో స్పందించిన అధికారులు తుప్పుపట్టిన ఇనుపపైపులను తొలిగించి నూతన పైపులను ఏర్పాటుచేశారు.

సహజయోగం మహాయోగం..

చెరుకుపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): చెరుకుపల్లిలోని బిట్రా వెంకటసుబ్బారావు సహజయోగ కేంద్రం ధ్యానమందిరం 3వ వార్షికోత్సవం, దసరా నవరాత్రుల సందర్భంగా ఆదివారం హవన్ కార్యక్రమం, దసరాపూజా నిర్వహించారు. హవన్‌చేయడం ద్వారా పరిసరాల్లో ఉన్న సమస్యలను ప్రతి వ్యక్తి ఎదుర్కొంటున్న నెగటీవ్ సమస్యలు తొలగి లోకకల్యాణం సిద్ధిస్తుందని సహజయోగుల కోఆర్డినేటర్ జయశ్రీ అన్నారు. నేటికాలంలో విపరీత ధోరణితో ఉన్న సమాజం శాంతియుతంగా జీవించడానికి ఈ సహజయోగం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో బిట్రా వెంకటసుబ్బారావు, దివి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ కన్నుమూత

కొల్లూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీటీసీ సభ్యులు కాట్రగడ్డ రామారావు (80) కన్నుమూశారు. మండలంలోని తడికలపూడికి చెందిన రామారావు ఆదివారం ఉదయం మృతి చెందిన సమాచారం తెలుసుకున్న మండల పార్టీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, ఆయన పార్థివదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలియజేశారు. పార్టీ నాయకులు సుంకర శ్రీనివాసరావు, వేములపల్లి మోహనకృష్ణ, ముమ్మనేని నారయ్య, మురళి, పెదపూడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొండుభొట్లపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండుభొట్లపాలెం జడ్పీ హైస్కూలు పూర్వవిద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. 1992-1993 సంవత్సరంలో 10వ తరగతి చదివిన వారంతా ఒకే వేదికపైకి వచ్చారు. నాటి మధురస్మృతులను నెమరవేసుకున్నారు. నాటి గురువులను సన్మానించారు. హెచ్‌ఎం ఎస్‌ఎం సుభానీకి గడ్డికోత మిషన్‌ను పూర్వవిద్యార్థులు అందించారు.

భగత్‌సింగ్ చిరస్మరణీయులు



పుష్పాంజలి ఘటిస్తున్న డాక్టర్ పీసీ సాయిబాబు, బ్రహ్మం, బాషా తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్ర జ్యోతి): చిన్న వయస్సులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన విప్లవ వీరకిశోరం భగత్ సింగ్ చిరస్మరణీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు పేర్కొన్నారు. భగత్ సింగ్ 118వ జయంతి కార్యక్రమాన్ని ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలోని ఆయన విగ్రహం వద్ద నిర్వహించారు. విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఆయన మాట్లాడుతూ ఆయన ఆలోచనలు నుండి మనమంతా పేరణ పొందాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు జీవీ బ్రహ్మం, న్యాయవాది బాషా, కోట వెంకేటశ్వర్లురెడ్డి, రామారావు, లోహియా తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం ప్రారంభం

చెరుకుపల్లి, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బాపట్ల యజ్ఞహాస్పటల్ ఆదివారం గుళ్లపల్లి జడ్‌పీ హెచ్‌ఎస్‌లో నిర్వహించిన ఉచితవైద్యశిబిరాన్ని టీడీపీ నాయకుడు అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో ఇలాంటి ఉచిత వైద్యశిబిరాలు పెట్టి పేదప్రజలకు ఉచితచికిత్సలు అందించడం అభినందనీయమన్నారు. ఈ వైద్యశిబిరంలో 180మందికి చికిత్సలు అందించామని వైద్యులు డాక్టర్ యజ్ఞశ్రీకాంత్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మత్తి భాస్కరరావు, టీడీపీనాయకులు తాతా ఏడుకొండలు, వంగరు శ్రీనివాసచక్రవర్తి పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరంలో ఆరోగ్యపరీక్షలు చేయించు కుంటున్న అనగాని శివప్రసాద్

అలరించిన శరన్నవరాత్రి అలంకారాలు



కర్లపాలెం: పాపిరెడ్డిపాలెంలో చండీ అవతారంలో అమ్మవారు



కర్లపాలెం: కొత్తనందాయపాలెంలో చండీ అవతారం..

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లూరులో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శ్రీరాజ్యలక్ష్మీఅమ్మవారిని ఆదివారం శ్రీ కాత్యాయని దేగా అలంకరించారు. ఖాజీపాలెంలో శ్రీకాశీవిశ్వనాథస్వామి దేవస్థానంలో శ్రీశాకాంబరిదేవిగా అలంకరించారు. మంతెనవారిపాలెంలో శ్రీగంగాపర్వతవర్ధిని సమేత శ్రీరామలింగేశ్వరదేవస్థానంలో శ్రీలలితాపరమేశ్వరి స్వరూపదేవి అలంకరణలో భక్తులకు దర్శమిచ్చారు.

- రేపల్లె: నియోజకవర్గంలోని పలు దేవాలయాల్లో అన్నపూర్ణాదేవిగా, దుర్గాదేవిగా భక్తులకు దుర్గమ్మ దర్శనమిచ్చింది.
- వేమూరు: జంపని రామేశ్వరాలయంలో పార్వతి అమ్మవారిని గజలక్ష్మిగా, చావలి వాలేశ్వరాలయంలో లలితాదేవిగా, అబ్బనగూడవల్లి శివాలయంలో మహాచండీగా అలంకరించారు. చావలి గోగులమ్మ ఆలయంలో పండ్లతో అలంకరించారు.
- చెరుకుపల్లి: గుళ్ళపల్లిలోని గంగాంబికా అమ్మవారు మహాచండీదేవిగా దర్శనమిచ్చారు.
- అమృతలూరు: గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో పార్వతీ అమ్మవారు మహాచండికాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- కొల్లూరు, భట్టిప్రోలు: కొల్లూరులో అనంత భోగేశ్వరస్వామి ఆలయంలో పార్వతిఅమ్మవారు వైష్ణవిదేవిగా, కోటిపల్లిలోని సత్యజ్ఞానప్రసూనాంబ అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా, భట్టిప్రోలులోని వాసవీ కన్యకపరమేశ్వరి దేవస్థానంలో ధనలక్ష్మిదేవిగా, పార్వతీ అమ్మవారు ధాన్యలక్ష్మిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- బాపట్ల: సూర్యలంకరోడ్డులో శ్రీలలితా త్రిపురసుందరి దేవి పీఠం ఆధ్వర్యంలో అమ్మవారు శ్రీమహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- చుండూరు: వలివేరులో శ్రీలలితా అమ్మవారి దేవాలయంలో శ్రీమహాచండీగా భక్తులకు దర్శనమిచ్చారు. చినపరిమిలోని శ్రీగంగాపార్వతి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు శ్రీచండీదేవిగా భక్తులను అనుగ్రహించారు.
- కర్లపాలెం: కర్లపాలెంలోని పాపిరెడ్డిపాలెం, శ్రీరామకృష్ణసేవాసమితి, కొత్తనందాయపాలెంలో అమ్మవారు చండీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.



చుండూరు: వలివేరులో మహాచండీగా అమ్మవారు



చుండూరు: చినపరిమిలో శ్రీచండీ అలంకరణ..



బాపట్ల: శ్రీమహాచండీదేవిగా శ్రీరాజ్యలక్ష్మీ అమ్మవారు



బాపట్ల: శ్రీశాకాంబరిదేవిగా శ్రీఅన్నపూర్ణాదేవి అమ్మవారు



కొల్లూరు: కోటిపల్లిలో బాలత్రిపురసుందరిగా సత్యజ్ఞాన ప్రసూనాంబ



బాపట్ల: శ్రీమహా చండీదేవిగా శ్రీలలిత త్రిపురసుందరిదేవి..



వేమూరు: జంపని రామేశ్వరాలయంలో గజలక్ష్మిగా..



రేపల్లె: మహాచండీదేవిగా గంగాంబికా అమ్మవారు

విశ్వకవి గుర్రం జాషువా

● ఘనంగా జయంతి వేడుకలు

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): విశ్వకవి గుర్రం జాషువా అని సాహితీభారతి అధ్యక్షుడు రావూరి నరసింహవర్మ అన్నారు. ఆదివారం బాపట్ల సాహితీభారతి ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 130వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాహితీభారతి కోశాధికారి ఆదంషఫీ, ఉపాధ్యక్షుడు మర్రి మాల్యాద్రిరావు, ప్రజాకవి డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ గుర్రం జాషువా కుల వివక్షకు ఎంతగా గురైన ఏమాత్రం ఆధైర్యపడక మహోన్నత రచనలు చేశారన్నారు. కార్యక్రమంలో సాహితీభారతి సభ్యులు దగ్గుమల్లి శామ్యూల్, కామరాజు కాళీదాసు, బొడ్డుపల్లి శ్రీరామచంద్రమూర్తి, కస్తూరి శ్రీనివాసరావు, ఎం.జాకబ్ తదితరులు జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

ఆధునిక కవులలో జాషువాది ప్రముఖ స్థానం

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): ఆధునిక తెలుగుకవులలో జాషువాది ప్రముఖ స్థానమని అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఛైర్మన్ పఠాన్ రాజేష్ పేర్కొన్నారు. జాషువా జయంతి కార్యక్రమాన్ని ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలోని జాషువా విగ్రహానికి పుష్పాంజలి ఘటించి అక్కడ జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక ప్రయోజనం కోసం రచనలు చేశారని, కవిత్వాన్ని ఆయుధంగా చేసుకొని మూఢాచారాలపై తిరగబడ్డారని కొనియాడారు.



జాషువా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నరసింహవర్మ, ఆదం షఫి తదితరులు



జాషువా విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఛైర్మన్ పఠాన్ రాజేష్ తదితరులు

తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా గాంధీ



ఇనగంటి గాంధీ

బాపట్ల, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఇనగంటి గాంధీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికలో ఉపాధ్యక్షులుగా ఎన్.నరసింహారావు, తటవర్తి గురువులు,నేరెళ్ళ కాశీ, కార్యదర్శిగా కాసాని శ్రీనివాసరావు, ఎగ్జిక్యూటివ్ సెక్రటరీగా దేవకి సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీగా వంబి సదానందరెడ్డి, కోశాధికారిగా నల్లమల్లి శ్రీనివాసరావులను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

జూదరుల అరెస్టు

కొల్లూరు, సెప్టెంబరు 28 (ఆంధ్రజ్యోతి): పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ జానకీ అమరవర్ధన్ ఆదివారం తెలిపారు. మండలంలోని తాడిగిరిపాడు గ్రామ శివారులో పేకాడుతున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో పేకాట స్థావరంపై దాడులు నిర్వహించి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.28,200 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పశువైద్యశాలలో వరల్డ్ యాంటీరాబీస్‌డే



కుక్కలకు యాంటీరాబీస్ ఇంజక్షన్‌లు చేస్తున్న వైద్యులు

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): బాపట్ల ప్రాంతీయ పశువైద్యశాలలో ఆదివారం వరల్డ్ రాబీస్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఊరుబండి శ్రీనివాస్ మాట్లాడుతూ రాబీస్ వ్యాధిపట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగియుండాలన్నారు. కుక్కలకు విధిగా టీకాలు వేయించాలన్నారు. ప్రతిఏట రాబీస్ వ్యాధిన బారినపడి 6వేల మరణాలు జరుగుతున్నాయన్నారు. అనంతరం 40 కుక్కలకు టీకాలు వేశారు. కార్యక్రమంలో డీఏహెచ్‌వో డాక్టర్ బి.వేణుగోపాల్, జంతుప్రేమికులు, పశుపోషకులు పాల్గొన్నారు.

గాన గాంధర్వుడు ఘంటసాల

● బయోఫిక్ దర్శక, నిర్మాత రామారావు

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): గాన గాంధర్వుడు పద్మశ్రీ ఘంటసాల అని బయోపిక్ దర్శక, నిర్మాత సి.హెచ్.రామారావు అన్నారు. ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక, ఊరూరా జనవిజ్ఞానం అధ్యక్షుడు కోట వెంకటేశ్వర్లురెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘంటసాల దిగ్రేట్ బయోఫిక్ పుస్తకాలను ఆవిష్కరించారు. మండల విద్యావనరుల కేంద్రంలోని ఘంటసాల విగ్రహం వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి రామారావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ అక్టోబరులో బయోఫిక్‌ను సినిమాథయేటర్‌లో ప్రదర్శించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జీవీ బ్రహ్మం, కాగిత శ్రీహరిరావు, నాళం గుప్తా, బాషా, సాహితీవేత్త విజయ్‌కుమార్, గురజాల శ్రీనివాసరావు, సూరిబాబు, కేశవులు, సయ్యద్ సుభానీ, తిమ్మనశ్యామ్ సుందర్, గుంటూరు సురేష్‌కుమార్, వెంకటేశ్వర్లు, నాగమనోహర లోహియా, వెంకటరామ ముసలారెడ్డి, ఎస్కే సుభానీ, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ఘంటసాల దిగ్రేట్ బయోఫిక్ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దర్శక, నిర్మాత సి.హెచ్.రామారావు, ఆలిండియా ఘంటసాల చైతన్యవేదిక నాయకులు కోట వెంకటేశ్వర్లురెడ్డి తదితరులు



అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామినాయుడును సన్మానిస్తున్న జనసేన నాయకులు విన్నకోట సురేష్, గుంటుపల్లి తులసీకుమారి తదితరులు

జనసేన బలోపేతానికి కృషి చేయాలి

● స్వామినాయుడు

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): జనసేనపార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేయటానికి పార్టీశ్రేణులంతా సమన్వయంతో కృషి చేయాలని అఖిల భారత చిరంజీవి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు స్వామినాయుడు తెలిపారు. ఆదివారం ఆయన బాపట్ల జనసేనపార్టీ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు విన్నకోట సురేష్ పార్టీశ్రేణులతో కలిసి ఆయనను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. విన్నకోట సురేష్ మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసేందుకు పార్టీశ్రేణులలో నూతన ఉత్సాహాన్ని నింపుతామన్నారు. కార్యక్రమంలో తూర్పుసత్రం ఛైర్మన్ గుంటుపల్లి తులసీకుమారి, చిరంజీవి యువత ఉపాధ్యక్షుడు విష్ణుమొలకల చంద్రమోహన్, అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల రవీంద్రబాబు, కొత్రా నాంచారయ్య, అనీల్, పడమటి ధర్మారావు, చిరంజీవుల లక్ష్మణ్, నరసింహ, కంచర్లపల్లి నరేంద్ర, గొట్టిపాటి శ్రీకృష్ణ, రాజశేఖర్, నాగలక్ష్మీ, గరిగంటి శ్రీనివాసరావు, కొక్కిరాల రాజేంద్ర, కిషోర్, పాలపర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం రాజేంద్రశుక్లాను కలిసిన బాపట్ల నాయకులు



మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎంతో బీజేపీ రాష్ట్ర యువమోర్చా కోశాధికారి బొడ్డు కృష్ణచైతన్య, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మిట్టు వంశీకృష్ణ

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్ డిప్యూటీ సీఎం రాజేంద్ర శుక్లా తిరుమల విచ్చేసిన సందర్భంగా ఆయనను రాష్ట్ర బీజేపీ యువమోర్చా కోశాధికారి బొడ్డు కృష్ణచైతన్య మర్యాదపూర్వకంగా కలిశారు. యువమోర్చా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు మిట్టు వంశీకృష్ణ, ఇతర నాయకులతో వెళ్ళి కలిశారు. కార్యక్రమంలో పార్టీశ్రేణులు పాల్గొన్నారు.

9న ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ



ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకు ఎమ్మెల్యే ప్రభాకర్‌ను ఆహ్వానించి సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

కొల్లూరు, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): అక్టోబరు 9వ తేదీన ఎన్టీఆర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను విగ్రహ కమిటీ ప్రతినిధులు ఆహ్వానించారు. ఆదివారం కొల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు మైనేని మురళీకృష్ణ, క్రాప టీడీపీ నాయకులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను ఆయన నివాసంలో కలిసి క్రాపలో జరిగే ఎన్టీఆర్ విగ్రహావిష్కరణకి విచ్చేయాలని కోరారు. ఎమ్మెల్యేను పుష్పగుచ్ఛం, దుశ్శాలువాలతో పార్టీ శ్రేణులు సత్కరించారు.

ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ ప్రకటించాలి

● ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్

బాపట్ల, సెప్టెంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు దసరా కానుకగా కరువుభత్యం ప్రకటించాలని ఎస్టీయూజిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి గుడివాడ అమర్‌నాథ్‌లు ప్రభుత్వాన్ని కోరారు. జిల్లా కార్యాలయంలో ఆదివారం ఎస్టీయూ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 నుండి ఇప్పటి వరకు 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, పీఆర్సీ బకాయిలు, డీఏ, సరండర్‌లీవ్ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐసీ లోన్‌లు, మెడికల్ రీఇంబర్స్‌మెంట్ బిల్లు బకాయిలు రూ.25వేల కోట్ల బకాయిలు ఉన్నాయని, వాటి విడుదలకు ప్రభుత్వం చొరవచూపాలని కోరారు. డీఎస్సీ నియామకాల ద్వారా కొత్త ఉపాధ్యాయులు పాఠశాలలకు వస్తున్నందున ఎంటీఎస్ ఉపాధ్యాయులను ఏకోపాధ్యాయ పాఠశాలలకు సర్దుబాటు చేయాలన్నారు. ఉపాధ్యాయవాణి కన్వీనర్ పీవీ నాగరాజు మాట్లాడుతూ 12వ పీఆర్సీ కమిషనర్ నియామకం ఆలస్యం అవుతున్నందున వెంటనే మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నూరుబాషా సుభానీ, ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు, రాష్ట్ర కౌన్సిలర్ జి.ఉదయ్‌శంకర్, సి.హెచ్.నరసింహారావు, గవిని శ్రీనివాస్, పి.శివాంజనేయులు, ఏవీ నారాయణ, తోట శివయ్య, కోటేశ్వరరావు, నారాయణమూర్తి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్